ఆంధ్ర విశ్వవిద్యాలయానికి అమృతకాలం



స్టార్టప్ ఇంక్యుబేషన్ సెంటర్



ఏయూ మెయిన్ గేట్

- జాతీయ స్థాయిలో ఏయూకు అగ్రాసనం
- యువతను ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దుతున్న స్టార్టప్‌లు
- పెరుగుతున్న వర్సిటీ పేటెంట్‌ల సంఖ్య

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలకు చేరువవుతోంది. వ్యవస్థాపక ఉపకులపతి కట్టమంచి రామలింగారెడ్డి, సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి దార్శనికులు వేసిన బలమైన పునాదులపై నిర్మితమైన విశ్వవిద్యాలయం నేడు మరింత ఉన్నత శిఖరాలను చేరుకుంటోంది. వర్తమాన సాంకేతిక ప్రగతికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దే దిశగా ప్రస్తుత ఉపకులపతి ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి చేస్తున్న కృషి సత్ఫలితాలనిస్తోంది. నాలుగేళ్లుగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు వర్సిటీకి అమృతకాలంగా చెప్పవచ్చు.

ఆవిష్కర్తలుగా నిలిపే 'ఆ హబ్'

కాలంతోపాటు మనం మారాలి.. అప్పుడే మనుగడ సాధ్యపడుతుంది. ఈ సూత్రాన్ని ఆచరణలో చూపుతోంది ఏయూ. నాలుగేళ్ల కిందట ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఏయూలో స్టార్టప్, ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి సంకల్పించారు. రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఎక్కడా లేని విధంగా స్టార్టప్, ఇంక్యుబేషన్ సెంటర్ 'ఆ హబ్'కి ప్రాణం పోశారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఓ సీఈవోను నియమించి.. నేడు వందకు పైగా అంకుర సంస్థలు, 500 మందికి పైగా యువత పనిచేసేలా తీర్చిదిద్దారు. దీనికి చేరువలో రూ.22 కోట్ల వ్యయంతో కేంద్ర ప్రభుత్వ సాయంతో నాస్కామ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించి, మరిన్ని స్టార్టప్‌లకు ఊతం అందించారు.

జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంక్

జాతీయస్థాయిలో వివిధ సంస్థలు ఇచ్చే వివిధ ర్యాంకుల్లో ఏయూ ముందు వరసలో ఉంటోంది. కేంద్ర మంత్రిత్వ శాఖ అందించే ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో 43వ స్థానం సాధించింది. ఇటీవల ది వీక్-హన్స్ సర్వేలో జాతీయ స్థాయిలో మల్టీ డిసిప్లీనరీ విశ్వవిద్యాలయాల విభాగంలో ఏయూ 9వ స్థానాన్ని సాధించింది. అఖిల భారత స్థాయిలో టాప్ 10లో ఏయూ నిలవాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షను సాకారం చేసే దిశగా ఏయూ పని చేస్తోంది.

చెయిర్ ప్రొఫెసర్.. ప్రొఫెసర్ ఆన్ ప్రాక్టీస్

యూజీసీ ప్రారంభించే ప్రతీ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయడంలో ఏయూ ముందుంటోంది. ఎన్ఈపీ 2020ను కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వెంటనే శతశాతం అమలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతకు మరింత బలాన్ని అందించే విధంగా ఏయూ పనిచేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఎక్కడా లేనన్ని చెయిర్ ప్రొఫెసర్లను ఏయూ ఇప్పటికే సాధించింది. వివిధ పరిశ్రమలు, సంస్థలు, వ్యక్తుల సహాయంతో దాదాపు 20కి పైగా చెయిర్ ప్రొఫెసర్‌లను ఏర్పాటు చేసింది. విభిన్న రంగాల్లో నిష్ణాతులైన నిపుణులను ప్రొఫెసర్ ఆన్ ప్రాక్టీస్‌గా స్వీకరిస్తూ.. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దే ప్రయత్నంలో సఫలీకృతమైంది.

ఐఐసీలో జాతీయస్థాయిలో నాలుగో స్థానం

అఖిల భారత స్థాయిలో అడుగిడిన తొలి సంవత్సరమే ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్‌లో జాతీయ స్థాయిలో 4 స్టార్ ర్యాంకింగ్ సాధించింది. కేంద్రీయ, ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలకు దీటుగా ఏయూ ఈ ర్యాంకును పొందింది.

పేటెంట్‌ల ప్రవాహం

ఏయూలో రెండేళ్ల కిందట ఏర్పాటైన ఐపీఆర్ చెయిర్ ఎంతో ప్రభావవంతంగా పనిచేస్తోంది. ఇప్పటికే 70కి పైగా పేటెంట్‌లను వర్సిటీ నుంచి దాఖలు చేయడం, పదుల సంఖ్యలో పేటెంట్‌లు సాధించడం చకచకా జరిగిపోయింది. మేధో హక్కులపై విద్యార్థులకు కోర్సును రూపకల్పన చేసి అందించి ఘనత ఏయూకే దక్కుతుంది. రాష్ట్రానికి నోడల్ ఏజెన్సీగా ఏయూ సేవలు అందిస్తోంది. పేటెంట్‌ను కమర్షియలైజ్ చేయడంలో కూడా ఏయూ ముందుంది.

నాడు-నేడుతో భవనాలకు పూర్వ వైభవం

రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన నాడు-నేడు పథకం స్ఫూర్తితో వర్సిటీలో భవనాలు, హాస్టళ్లు పూర్తిస్థాయిలో తమ స్వరూపాన్ని మార్చుకున్నాయి. దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన హాస్టల్ భవనాలు పూర్తిస్థాయిలో మరమ్మతులు పూర్తి చేసుకున్నాయి. సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేసిన మౌలిక వసతులు, మైదానాలు వర్సిటీకి అతిపెద్ద వనరుగా నిలుస్తున్నాయి. అన్యాక్రాంతమైన వందలాది కోట్లు విలువైన భూములను స్వాధీనం చేసుకోవడంలో అధికారుల చిత్తశుద్ధి సైతం విశాఖ ప్రజల అభిమానాన్ని చూరగొంది. ఫార్మా హబ్, ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్, డిజిటల్ జోన్, డాల్బీ అట్మాస్ రికార్డింగ్ స్టూడియో తదితర ప్రాజెక్టులు వర్సిటీ కీర్తికిరీటంలో కలికితురాళ్లుగా నిలవనున్నాయి.



డిజిటల్ రికార్డింగ్ స్టూడియో

ఉపాధి అవకాశాల వెల్లువ

వర్సిటీలో చేరిన ప్రతీ విద్యార్థి ఉపాధి అవకాశంతో బయటకు వెళ్లాలనే ఆశయంతో వర్సిటీ పనిచేస్తోంది. ఇప్పటికే ఇంజినీరింగ్, సైన్స్, ఆర్ట్స్, న్యాయ, ఫార్మసీ విభాగాలకు చెందిన మూడు వేల మందికి పైగా విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించింది. ఏయూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని ఈశ్వరీ ప్రియ రూ.84.5 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం సాధించి, రికార్డ్ సృష్టించింది.

అగ్రస్థానంలో ఏయూ.. అదే మా లక్ష్యం



రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు, యువత ఆకాంక్షలకు అనుగుణంగా.. వందేళ్లకు చేరుకుంటున్న ఏయూను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నాం. రాష్ట్ర యువతకు మనం అందించే నిజమైన ఆస్తి విద్య అని, యువత ఉపాధి కోసం ఎదురుచూడకుండా, ఉపాధి అవకాశాలను సృష్టించే స్థాయికి ఎదగాలని ఏయూ వేదికగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019లో పిలుపునిచ్చారు. వీటిని సాకారం చేసే దిశగా ఆర్ట్స్, సైన్స్, ఇంజినీరింగ్, ఫార్మసీ, న్యాయ కళాశాలలను అనుసంధానం చేస్తూ స్టార్టప్, ఇంక్యుబేషన్ కేంద్రాలను ఐఐటీలకు దీటుగా ఏర్పాటు చేశాం. శతాబ్ది వేడుకలకు సిద్ధమవుతున్న ఏయూను సాంకేతికతంగా, పరిశోధన, ఆవిష్కరణల రంగాల్లో అగ్రస్థానంలో నిలపడం లక్ష్యంగా నాలుగేళ్లుగా పనిచేస్తున్నాం. ప్రభుత్వ పూర్తి సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేస్తున్నాం.

– ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి, ఉపకులపతి, ఏయూ

పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

బీచ్‌రోడ్డు: పర్యావరణ పరిరక్షణ కోసం అవగాహన కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించాలని మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామిరెడ్డి సూచించారు. బీచ్‌రోడ్డులోని యూత్ హాస్టల్‌లో వడ్లమూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని స్వచ్ఛందంగా మానుకోవాలని సూచించారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పాండురంగారావు మాట్లాడుతూ గత 45 రోజులుగా తీరప్రాంత కాలుష్యంపై పోరాటం చేస్తున్నామన్నారు. తీర ప్రాంత కాలుష్యం వల్ల సముద్ర జీవరాసులు నాశనం అవుతున్నాయన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ ప్లకార్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో సుభాష్ చంద్రబోస్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

హిందీపై పట్టు సాధించాలి

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు శిక్షణ కొనసాగింది. నిపుణులైన అధ్యాపకులు సంస్కృతం, హిందీ భాష ప్రావీణ్యంపై మంగళవారం అవగాహన కల్పించారు. విద్యార్థి దశలోనే హిందీ భాషపై పట్టు సాధించాలని సూచించారు. తద్వారా విద్యార్థుల్లో భాషా నైపుణ్యం పెరుగుతుందన్నారు. హిందీ, సంస్కృతం నేర్చుకోవడంలో మెలకువలు తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు యోగాసనాలపై శిక్షణ అందించారు. పలు రకాల యోగసనాలు విద్యార్థులతో వేయించారు. శిబిరానికి 30 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేతాజీనగర్‌లో సమస్యలు పరిష్కరించాలని వినతి

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు పరిధి నేతాజీనగర్‌లో కార్పొరేటర్ అక్కరమాని రోహిణి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు ఆమెకు పలు సమస్యలు తెలియజేశారు. వెలగని వీధి దీపాలు, అపారిశుద్ధ్యంతో ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. వీధి దీపాలు వెలిగించినా వారం రోజులే పనిచేస్తున్నాయని, ఆ తర్వాత వెలగడంలేదని వాపోయారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు. దీంతో కార్పొరేటర్ స్పందించి వెంటనే వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సత్తి మందారెడ్డి, రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీను పాల్గొన్నారు.

హెల్మెట్ల పంపిణీ




హెల్మెట్లు పంపిణీ చేస్తున్న ఏడీసీపీ శ్రీనివాసరావు

బీచ్‌రోడ్డు: ప్రమాద రహిత ప్రయాణానికి హెల్మెట్ ధారణ తప్పనిసరి అని ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాస రావు అన్నారు. పుదుచ్చేరి రాష్ట్ర మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు 60వ జన్మదినం సందర్భంగా తీరంలో మంగళవారం హెల్మెట్లు పంపిణీ చేశారు. రాష్ట్ర బీసీ నాయకుడు విశ్వనాధపల్లి నాగసుందరం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఏడీసీపీ ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీలు రాజీవ్ కుమార్, జాన్ మనోహర్, సంస్థ ప్రతినిధులు బచ్చల త్రిమూర్తులు, సుమిత భరత్ ఫౌండేషన్ ప్రతినిధులు, మల్లాడి అభిమానులు పాల్గొన్నారు.

తీరంలో వ్యర్థాల తొలగింపు

బీచ్‌రోడ్డు: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని యాక్సిస్ బ్యాంక్ ఆధ్వర్యంలో సాగరతీరంలో ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించారు. ఈ కార్యక్రమాన్ని జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ సన్యాసిరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ప్లాస్టిక్ నిషేధాన్ని పటిష్టంగా అమలు చేయనున్నామని, అందుకు ప్రజలు పూర్తిగా సహకరించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణలో సంస్థలు, ఎన్జీవోలు భాగస్వాములవ్వాలన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.

దశ మహావిద్యలపై ప్రవచనం



అనుగ్రహ భాషణం చేస్తున్న శ్రీసిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి

సీతంపేట : లలితాపీఠంలో జరుగుతున్న దశ మహావిద్యల ప్రవచనాలలో భాగంగా మూడో రోజు 'దశ మహావిద్యల ఆవిర్భావం'కు సంబంధించి పురాణ విశేషాలపై లలితాపీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి అనుగ్రహ భాషణం చేశారు. దశ మహావిద్యలలో చిన్నమస్త అనే శక్తి దేవత స్వరూప స్వభావాలను ప్రవచించారు. అలాగే రేణుకా దేవి కథలోని అంతరార్థం విశ్లేషించారు. శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి స్వామిని, పెద్ద సంఖ్యలో భక్తులు, పండితులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

6 నుంచి స్మార్ట్ నానో టెక్నాలజీపై సదస్సు

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం, ఖతార్ విశ్వవిద్యాలయం సంయుక్తంగా జూలై 6 నుంచి 8వ తేదీ వరకు అంతర్జాతీయ సదస్సును విశాఖలోని గీతం ప్రాంగణంలో నిర్వహించనున్నామని స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.కృష్ణ తెలిపారు. వివిధ దేశాల నుంచి 50 మందికి పైగా శాస్త్రవేత్తలు సదస్సుకు హాజరు కానున్నారని తెలిపారు. బయో మెటీరియల్స్, సోలార్ సెల్స్, సెమీ కండక్టర్ టెక్నాలజీ, హైడ్రోజన్ ప్రొడక్షన్‌పై ప్రసంగిస్తారని తెలిపారు.

వర్షాకాలంలో సమన్వయంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

మహారాణిపేట : రాబోయే వర్షా కాలంలో వరద నిర్వహణకు లోతట్టు ప్రాంతాలు, ముంపు ప్రాంతాలను ముందుగా గుర్తించాలని విశాఖ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) డి.హుస్సేన్‌సాహెబ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం తన ఛాంబర్లో 2023 నైరుతి-పశ్చిమ రుతు పవనాలతో వర్షాలు కురిసినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దార్లు మండల స్థాయిలో ఎంపీడీవోలు, ఎలక్ట్రికల్, మెడికల్, మున్సిపల్, వ్యవసాయం, పశుసంవర్ధక, అగ్నిమాపక, టెలికమ్యూనికేషన్ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించాలన్నారు. తుపాను షెల్టర్ల పరిస్థితిని పరిశీలించి మరమ్మతులు అవసరమైతే చేయించాలని ఆదేశించారు. జిల్లాలో సంబంధిత ప్రదేశాల్లో తగినంత మందుల నిల్వలు అందుబాటులో ఉండేలా చూడాలని వైద్య శాఖ అధికారులకు తెలిపారు. మండల స్థాయిలో రెవెన్యూ, పోలీసు, వైద్య, అగ్నిమాపక, రోడ్లు - భవనాలు, ఇతర శాఖలకు సంబంధించిన అధికారుల సమన్వయంతో మాక్‌డ్రిల్ నిర్వహించాలన్నారు. జీవీఎంసీ పరిధిలో శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించి, తగు చర్యలు చేపట్టాల్సిందిగా ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ ఏవో మనోరంజని, మెడికల్, జీవీఎంసీ, పోలీస్ శాఖ అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం

ఎంవీపీ కాలనీ: ఏపీఎస్ ఆర్‌టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ విశాఖ రీజినల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం వాల్తేర్ డిపోలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. సంఘం రాష్ట్ర కోశాధికారి పీవీవీ మోహన్ ముఖ్య అతిథిగా పాల్గొని ఉద్యోగుల భవిష్యత్ కార్యాచరణపై ప్రసంగించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ డిపోల్లో ఉన్న సమస్యలపై చర్చించారు. ఆయా సమస్యల పరిష్కారానికి తదుపరి ఉద్యమ కార్యచరణ కోసం ఉద్యోగులతో చర్చలు జరిపారు. తొలుత సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్‌కు, అనంతరం ఎమ్మెల్యేలు, ఎంపీలకు ఉత్తరాలు ఇవ్వాలని నిర్ణయించారు. అనంతరం జిల్లా కలెక్టర్ల కార్యాలయాల ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టి పోరాడాలని తీర్మాణం చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శులు పీపీఎం రాజు, జీఆర్ రావు తదితరులు పాల్గొన్నారు.

అతిసార నియంత్రణ పక్షోత్సవాల పోస్టర్ విడుదల



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో మంగళవారం ఉధృత అతిసార నియంత్రణ పక్షోత్సవాల గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ నెల 5 నుంచి ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. 17 వరకు కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. వేసవి మొదలుకుని వర్షాకాలం వరకు అతిసార బారిన పడే ప్రమాదమున్నందున అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5 సంవత్సరాల వయసు పిల్లలున్న ప్రతి ఇంటికీ ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎం వెళ్లి జింక్ మాత్రలు సరఫరా చేస్తారని తెలిపారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పట్టణ ఆరోగ్య కేంద్రం, సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఓఆర్ఎస్, జింక్ కార్నర్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ గోడపత్రిక అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో మహిళా ఆరోగ్య అధికారి డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు, వివిధ విభాగాల అధికారులు బి.జ్యోతి, ధర్మేంద్ర, మురళీకృష్ణ, శశిభూషణ్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ముడసర్లోవ గ్యాలరీని ఆధునికీకరించాలి



ముడసర్లోవ గ్యాలరీ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఆరిలోవ: ముడసర్లోవ గ్యాలరీని ఆధునికీకరించాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు డిమాండ్ చేశారు. ముడసర్లోవ జీవీఎంసీ నీటి సరఫరా గ్యాలరీని మంగళవారం ఆయన పదో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి, టీడీపీ నాయకులతో కలసి సందర్శించారు. గ్యాలరీని పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. దీనికి అడుగు భాగంలో మట్టి పేరుకుపోవడంతో ఆరిలోవ ప్రాంతానికి నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని, దీనికి నీటి సరఫరా అధికారుల నిర్లక్ష్యమే కారణమని అన్నారు. ముడసర్లోవ రిజర్వాయరులో నీరు పుష్కలంగా ఉన్నా , ఆ నీటిని వడకట్టడానికి వీల్లేకుండా గ్యాలరీ మరమ్మతులకు గురైందన్నారు. దీనివల్ల శుభ్రమైన నీటిని అవసరం మేరకు ప్రజలకు అందించలేకపోతున్నారన్నారు. మేయర్ హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ స్పందించి వెంటనే గ్యాలరీ ఆధునికీకరణ పనులు చేపట్టాలని, లేకుంటే ఆరిలోవ ప్రజలతో కలసి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు ఒమ్మి అప్పలరాజు, బుడుమూరు గోవింద్, మూది అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి మంగళవారం విశేషంగా ఆర్జిత సేవలు జరిగాయి. ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని అందజేశారు.

ఘనంగా గరుడసేవ : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం గరుడసేవ ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టంప జేసి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. విశేషంగా హారతులు అందజేశారు. భక్తులను గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

గోడలపై ప్రకటనలు కనిపిస్తే జరిమానా

తగరపువలస: భీమిలి జోన్ పరిధిలో ప్రభుత్వ, ప్రైవేట్ గోడలపై పలు వ్యాపార ప్రకటనలు కనిపించడంపై టౌన్ ప్లానింగ్ అధికారులపై జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. తగరపువలసలో మంగళవారం పర్యటించిన ఆయన జీడిపప్పుల దుకాణాలకు సమీపంలో ఫ్లై ఓవర్ కింద ప్రైవేట్ ప్రకటనలు అంటించి ఉండటంపై ఆరా తీశారు. వెంటనే వాటిని తొలగించి ప్రకటనకర్తల నుంచి అపరాధ రుసుము వసూలు చేయాలని ఆదేశించారు. దివీస్ పార్కును ఆనుకుని ప్రధాన కాలువలలో పూడిక తొలగించాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితులలోనూ సర్వీస్ రోడ్లపై నీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. నమ్మివానిపేట డంపింగ్‌యార్డు నుంచి ఎప్పటికప్పుడు చెత్తను కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. భీమిలి జోన్‌లో ప్రధాన రహదారులు సరిగా శుభ్రం చేయడం లేదని, వీటిపై దృష్టి సారించాలని జెడ్సీ బి.రామును ఆదేశించారు.

నాడు ఇరుకు.. నేడు విశాలం



గతంలో ఇరుకుగా ఉన్న చినగదిలి - సూర్యతేజనగర్ రోడ్డు



ప్రస్తుతం విస్తరించి విశాలంగా నిర్మిస్తున్న రోడ్డు

ఆరిలోవ: ఆరిలోవలో రోడ్లు విశాలమవుతున్నాయి. ఇక్కడ పలుచోట్ల ఇరుకుగా ఉన్న రోడ్లను ఇటీవల విశాలంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే హనుమంతవాక నుంచి అడవివరం వరకు ఐదు లైన్ల బీఆర్‌టీఎస్ రోడ్డు ఉంది. దీని నుంచి ఆరిలోవకు చేరడానికి పెదగదిలి, చినగదిలి, దీన్‌దయాల్‌పురం వద్ద కనెక్టింగ్ రోడ్లు ఉన్నాయి. వాటిలో ఇప్పటికే పెదగదిలి, దీన్‌దయాల్‌పురం వద్ద విశాలమైన కనెక్టింగ్ రోడ్లు ఆరిలోవ వైపునకు జీవీఎంసీ నిర్మించింది. చినగదిలి నార్త్ షిరిడీ సాయిబాబా ఆలయం నుంచి సూర్యతేజనగర్ మీదుగా అంబేడ్కర్ కూడలి వరకు 20 అడుగుల ఇరుకైన రోడ్డు ఉండేది. దీంతో ఇక్కడ ఇరుకైన రోడ్డులో వాహన చోదకులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడేవారు. వర్షం కురిస్తే రోడ్డు బురదమయమవుతుండేది. కొన్నిచోట్ల వర్షం నీరు నిల్వ ఉండిపోయేది. ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయింది. ఇటీవల జీవీఎంసీ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2.35 కోట్లతో ఈ రోడ్డును కొత్తగా నిర్మిస్తున్నారు. ఇంతవరకు ఇరుకుగా ఉన్న రోడ్డును విస్తరించి కొన్నిచోట్ల 60 అడుగులు, మరికొన్నిచోట్ల 80 అడుగుల వెడల్పుతో నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ రోడ్డు పనులు సుమారు 90 శాతం పూర్తయ్యాయి. ఇంకా మధ్యలో డివైడర్లు, ఇరుపక్కలా ఫుట్‌పాత్‌లు నిర్మించి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం విశాలమైన ఈ రోడ్డులో వాహనచోదకులు ఎలాంటి ఇబ్బంది లేకుండా సంతోషంగా ప్రయాణిస్తున్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

8న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 8న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.